






AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

7-10-2025 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2


## మద్యం దరఖాస్తులు స్వీకరించే ప్రాంతాల్లో మార్పులు

**అక్షరటుడే, ఇందూరు:** మద్యం టెండర్లకు సంబంధించి దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడంతో జిల్లా ఎక్సైజ్ శాఖ చర్యలు చేపట్టింది. నిజామాబాద్, ఆర్మూర్ పరిధిలోని దరఖాస్తు దారులు జిల్లాకేంద్రంలోని ఎక్సైజ్ స్టేషన్ బిల్డింగ్‌లో (ఎస్ఎఫ్ఎస్ పాఠశాల పక్కన) తమ అప్లికేషన్లు అందజేయాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి తెలిపారు. బోధన్, భీమ్‌గల్, మోర్తాడ్ స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాలకు ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఎప్పటిలాగే దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం ఎస్‌హెచ్‌వో 8712658973ను సంప్రదించాలని కోరారు.



## ఎస్సారెస్పీకి భారీగా వరద..

**అక్షరటుడే, మెండోరా:** తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. ఎగువ నుంచి భారీగా జలాశయంలోకి ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో ప్రాజెక్టు అధికారులు 37 గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులోకి 2,36,460 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. అధికారులు 2,37,730 క్యూసెక్కుల నీటినిదిగువకు వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1090.90 అడుగులు (80.053 టీఎంసీలు) నీటినిల్వ ఉంది. వరద నీరు భారీగా చేరుతున్న నేపథ్యంలో ప్రాజెక్టు నుండి ఆయా కాల్వల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. కాకతీయ కాలువ ద్వారా 4,000 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 4,000 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 650 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 200 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు, అదనంగా 709 క్యూసెక్కుల నీరు ఆవిరైపోతోంది. మొత్తం 1,87,730 క్యూసెక్కుల నీరు వరద గేట్ల ద్వారా నీరు విడుదల జరుగుతోంది.



మున్సిపల్ కార్యాలయం ముందు ఎన్టీఆర్ విగ్రహం


జీజీహెచ్ వద్ద వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం

### కోడ్ కూసినా..
## ముసుగు పడలే..

**రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ విడుదలై కోడ్ అమల్లోకి వచ్చినప్పటికీ కామారెడ్డిలో అధికారుల్లో చలనం లేకుండా పోయింది. నిబంధనల ప్రకారం.. రాజకీయ నాయకుల విగ్రహాలు, అభివృద్ధి పనులకు వేసిన శిలాఫలకాలకు ముసుగు వేయాల్సి ఉంటుంది. ఫ్లెక్సీలు, కటౌట్లు ఉంటే తొలగించాల్సి ఉంటుంది. కానీ కోడ్ వచ్చి తొమ్మిది రోజులైనా అధికారులు విగ్రహాలకు ముసుగులు వేయడంలో నిర్లక్ష్యం చూపించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.** – అక్షరటుడే, కామారెడ్డి


ఇందిరా చౌక్ వద్ద ఇందిరాగాంధీ విగ్రహం


నిజాంసాగర్ చౌరస్తాలో రాజీవ్ గాంధీ విగ్రహం



**బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీంలో భాగంగా పిల్లలకు విద్యా, వసతిని అందించిన ప్రైవేటు యాజమాన్యాలు బకాయిల భారంతో ఇబ్బందులు పడుతున్నాయి. మూడేళ్లుగా విద్యార్థుల అందాల్సిన నిధులు రావడం లేదు. దీంతో ఈ స్కీం అమలు చేస్తున్న పాఠశాలలు ఆర్థికంగా దెబ్బతింటున్నాయి. పథకాన్ని అమలు చేయలేమని చేతులెత్తేస్తున్నాయి. ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వానికి నివేదించినా స్పందించకపోవడంతో.. విద్యార్థులను తరగతులకు అనుమతించబోమని తేల్చి చెప్పేశాయి. దీంతో విద్యార్థులు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది.** - అక్షరటుడే, ఇందూరు

### ప్రభుత్వం పైసలిస్తేనే
# పాఠాలు

- బెస్ట్ అవైలబుల్ స్కూళ్లకు నిధులు విడుదల చేయని సర్కారు
- మూడేళ్లుగా పేరుకుపోయిన బకాయిలు
- ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న యాజమాన్యాలు
- విద్యార్థులను తరగతులకు అనుమతించొద్దని నిర్ణయం

ఎస్సీ, ఎస్టీ నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలో అభ్యసించేందుకు ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌ను ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా 1 నుంచి 5వ తరగతి డే స్కాలర్ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.28 వేలు, 5 నుంచి 10వ తరగతి హాస్టల్ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.42 వేలు ప్రభుత్వ అందజేస్తుంది. ఒక్కో పాఠశాలలో 235 సీట్లు కేటాయించారు. ఈ పథకంలో ఎంపికైన హాస్టల్ విద్యార్థులకు పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం, కాస్మోటిక్, నాణ్యమైన భోజనం, వసతి కల్పించాలి. అయితే వీటి నిర్వహణకు ప్రభుత్వం నిధులు విడుదల చేయాల్సి ఉంటుంది. కానీ మూడేళ్లుగా నిధులు రాకపోవడందో యాజమాన్యాలపై భారం పడుతోంది.

#### జిల్లాలో 8 పాఠశాలల్లో..

రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకం 215 పాఠశాలల్లో అమలు చేస్తున్నారు. జిల్లాలో 8 పాఠశాలల్లో స్కీం కొనసాగుతోంది. నగరంలోని విజ్ఞాన్, రవి పాఠశాలలు, ఆర్మూర్‌లోని సెయింట్ పాల్స్, భీమ్‌గల్ లిటిల్ ఫ్లవర్, బోధన్‌లోని ఇందూర్ మోడల్ స్కూల్, వంశీ, విజయ పాఠశాలలు, చందూరు విక్టరీ పాఠశాలల్లో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. సుమారు 1500 మంది విద్యార్థులు ఈ స్కీమ్‌లో భాగంగా చదువుతున్నారు. సుమారు రూ.5 కోట్ల బకాయిలు జిల్లాకు రావాల్సి ఉంది. నిధులు లేకపోవడంతో అటు యాజమాన్యాల నుంచి విద్యార్థులు ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు.

#### బడికి రావద్దంటూ ఫోన్లు

బకాయిల విడుదల కోసం బెస్ట్ అవైలబుల్ స్కూల్ యాజమాన్యాలు అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాయి. అయితే ఎటువంటి స్పందన లేకపోవడంతో విద్యార్థులను తరగతులకు అనుమతించొద్దని నిర్ణయించుకున్నాయి దసరా సెలవులు ముగిసి పాఠశాలలు పునః ప్రారంభమైనా.. పథకంలో కొనసాగుతున్న విద్యార్థులు మాత్రం బడికి రాలేకపోయారు. యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు, లేఖల ద్వారా సమాచారం అందించాయి. బకాయిలు విడుదల అయ్యేవరకు విద్యార్థులను అనుమతించేది లేదంటూ ఖరాఖండిగా చెబుతున్నాయి. బడికి వెళ్లకపోతే తమ పిల్లల భవిష్యత్తు ఇబ్బందుల్లో పడుతుందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

> **మూడేళ్లుగా నిధులు రావడం లేదు**
>
> మా పాఠశాలలో బెస్ట్ అవైలబుల్ స్కీంను అమలు చేస్తున్నాం. గత మూడేళ్లుగా నిధులు రావడం లేదు. దీంతో నిర్వహణ భారంగా మారింది. అన్ని యాజమాన్యాల నిర్ణయం మేరకు పాఠశాలలకు విద్యార్థులకు అనుమతి ఇవ్వడం లేదు. ప్రభుత్వం ఇకనైనా నిధులు విడుదల చేయాలని కోరుతున్నాం. – జయసింహ గౌడ్, విజ్ఞాన్ పాఠశాల



## లైసెన్స్‌డ్ ఆయుధాలను ఠాణాల్లో అప్పగించాలి

**అక్షరటుడే, ఇందూరు:** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో లైసెన్స్‌డ్ ఆయుధాలు కలిగిన వారు వెంటనే వాటిని ఆయా పోలీస్‌స్టేషన్లలో అప్పజెప్పాలని సీపీ సాయిచైతన్య సూచించారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో ఎవరు కూడా లైసెన్స్‌డ్ ఆయుధాలను కలిగి ఉండవద్దని ఆయన సూచించారు. ఎన్నికల నియమ నిబంధనలను ప్రతిఒక్కరూ తూచా తప్పకుండా పాటించాలని పేర్కొన్నారు. ఆయుధాలను ఈనెల 9వ తేదీలోపు సంబంధిత పోలీస్టేషన్లలో అందజేయాలని సీపీ సూచించారు. ఎవరైనా ఆయుధాలను అప్పగించికపోతే ఆర్మ్స్ యాక్ట్ ప్రకారం చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా ఉత్తర్వుల నుంచి మినహాయింపు కావాలని భావిస్తే.. పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని సంబంధిత అధికారికి రాతపూర్వకంగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.




## కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తిచేయాలి


**అక్షరటుడే, బాన్సువాడ:** రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలని డీసీవో రామ్మోహన్‌రావు సూచించారు. బాన్సువాడలో మంగళవారం వరిధాన్యం కొనుగోలు సీజన్ ప్రారంభానికి ముందుగా అవసరమైన ఏర్పాట్లను సమీక్షించారు. బాన్సువాడ, నస్రుల్లాబాద్, బీర్కూర్ మండలాల పరిధిలోని పీఏసీఎస్ కార్యదర్శులు, సిబ్బంది, ట్యాబ్ ఆపరేటర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రేడ్ 'ఏ' రకం వరికి క్వింటాలుకు రూ.2,389, సాధారణ రకం వరికి రూ.2,369 మద్దతు ధర చెల్లించనున్నట్లు తెలిపారు. ధాన్యం తూకం, రవాణా, చెల్లింపుల విషయంలో పారదర్శకత పాటించాలని, రైతులకు ఇబ్బందులు రానీయకుండా తక్షణమే కొనుగోలు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్, క్లస్టర్ అధికారి కవిత, అధికారులు నర్సింలు, నాగరాజు, సాయినాథ్, సృజన్, అలీమొద్దీన్, సొసైటీ కార్యదర్శులు జకీర్ హుస్సేన్, విఠల్, శ్రీనివాస్, భూమయ్య, వెంకట్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## దసరా నేపథ్యంలో ఆర్టీసీకి లాభాలపంట

**అక్షరటుడే, ఇందూరు:** దసరా పండుగ ఆర్టీసీకి లాభాల పంట పండించింది. ప్రజలు బస్సుల్లో ఎక్కువ సంఖ్యలో ప్రయాణించడంతో సంస్థ లక్ష్యానికి మించి లాభాలను సాధించింది. రాష్ట్రంలోనే నిజామాబాద్ రీజియన్ ఉత్తమ ప్రగతిని సాధించి రికార్డు ఆదాయాన్ని ఆర్జించింది. రాష్ట్ర ఆదాయంలో నిజామాబాద్ రీజియన్ రెండో స్థానంలో నిలిచింది. రోడ్డు రవాణా సంస్థ అన్ని రీజియన్లకు రూ.18 కోట్లు లక్ష్యాన్ని విధించగా, రూ.19.53 కోట్లు వసూలు చేసి ప్రగతిని సాధించింది. అలాగే నిజామాబాద్ రీజియన్ టార్గెట్ రూ.1.17 కోట్లు కాగా, రూ.1.19 కోట్లు సాధించింది. తెలంగాణలో దసరా అతిపెద్ద పండుగ కావడం, బతుకమ్మకు మహిళలు అధికంగా ప్రయాణించడం ఇందుకు దోహదపడ్డాయి. ప్రధానంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో గతం కంటే ఈసారి ప్రయాణాలు ఎక్కువగానే సాగాయి. దసరా రద్దీని దృష్టిలో పెట్టుకొని రీజనల్ మేనేజర్ జ్యోత్స్న, డిప్యూటీ రీజినల్ మేనేజర్ మధుసూదన్, పీవో పద్మజ తదితరులు ప్రత్యేక ప్రణాళికను రూపొందించారు. గత నెల 26 నుంచి ఈనెల 6వ తేదీ వరకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. ప్రధానంగా నిజామాబాద్ రీజియన్‌లోని అన్ని డిపోల నుంచి హైదరాబాద్‌కు, ఇతర జిల్లాలు, గ్రామాలకు 566 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. దీంతో లక్ష్యాన్ని సులువుగా చేరుకున్నారు.

**డిపోల వారీగా ఆదాయం (రూ.లక్షల్లో )**

| డిపో | లక్ష్యం | సాధన |
|---|---|---|
| ఆర్మూర్ | 13.98 | 17.30 |
| బోధన్ | 21.23 | 22.25 |
| నిజామాబాద్-1 | 21.10 | 24.26 |
| నిజామాబాద్-2 | 29.25 | 24.61 |
| బాన్సువాడ | 11.59 | 12.55 |
| కామారెడ్డి | 19.86 | 18.13 |





## ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో వాల్మీకి చిత్రపటానికి కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. సమాజానికి వాల్మీకి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

#### కామారెడ్డి ఎస్పీ కార్యాలయంలో..

**అక్షరటుడే, కామారెడ్డి:** వాల్మీకి జయంతిని కామారెడ్డి ఎస్పీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు జిల్లా అదనపు ఎస్పీ నరసింహారెడ్డి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వాల్మీకి బోధనలు సత్యం, ధర్మం, సమానత్వానికి మార్గదర్శకాలని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గం ఆచరణాత్మకమన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించినప్పుడే వాల్మీకికి మనం ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీపీవో లింగనాయక్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు సంతోష్ కుమార్, నవీన్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## కవిత సమక్షంలో జాగృతిలో చేరికలు

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లా నుంచి పలువురు నాయకులు ఎమ్మెల్సీ కవిత సమక్షంలో మంగళవారం తెలంగాణ జాగృతిలో చేరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి నియోజకవర్గం నుంచి బీఎస్పీ తరపున ఎమ్మెల్యేగా పోటీచేసిన సురేష్ గౌడ్, ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసిన స్వతంత్ర అభ్యర్థి తలారి బాలరాజులు కవిత సమక్షంలో జాగృతిలో చేరారు. వారికి కవిత కండువాలు కప్పి జాగృతిలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జాగృతి జిల్లా నాయకులు సంపత్ గౌడ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.





## 'బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటే సహించేది లేదు'

**అక్షరటుడే, ఇందూరు:** బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవాలని చూస్తే సహించేది లేదని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పూలాంగ్ చౌరస్తాలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తరుణంలో కొందరు అగ్రవర్ణాల వారు కోర్టులో కేసులు వేయడం తగదన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్, శంకర్, అజయ్, సాయి, శ్రీలత, శ్రీనివాస్, జయ, రుక్మిణి, సదానంద్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

**అక్షరటుడే, బాన్సువాడ:** స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుచుకునేలా కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఏనుగు రవీందర్ రెడ్డి అన్నారు. వర్ని, చందూర్, మోస్రా మండలాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. మరికొన్ని రోజుల్లో జరగనున్న లోకల్ బాడీ ఎలక్షన్లపై చర్చించారు. పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. స్థానిక ప్రజల సమస్యలు, అభివృద్ధి అంశాలపై చర్చించారు. ఆయన వెంట మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ సీనియర్ నేతలు ఉన్నారు.



## ఎల్లారెడ్డి కోర్టులో న్యాయవాదుల నిరసన

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై న్యాయవాది దాడి చేసేందుకు యత్నించడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్ రావు మాట్లాడుతూ.. న్యాయవ్యవస్థకు భంగం కలిగించే ఎలాంటి చర్యలైనా సహించేది లేదని పేర్కొన్నారు. న్యాయవాదుల హక్కులు, న్యాయస్థానాల గౌరవం కాపాడడంలో బార్ అసోసియేషన్ ఎల్లప్పుడూ ముందుండి పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. కోర్టుల గౌరవాన్ని కాపాడుకోవడం సమాజంలోని ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. సుప్రీంకోర్టులో జరిగిన సంఘటన దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు మచ్చ అని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో న్యాయవాదులు పద్మ పండరి, సతీష్, నామ శ్రీకాంత్, నాగం సాయిబాబా, నామ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## ఓటు చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ

**అక్షరటుడే, ఆర్మూర్:** ఓటు చోరీకి వ్యతిరేకంగా మండలంలోని చేపూర్ గ్రామంలో మంగళవారం సంతకాల సేకరణ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు చిన్నారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు మండలంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు దాసరి శ్రీకాంత్, రాంసన్, మాజీ ఎంపీటీసీలు గంగాధర్, ఎల్క రంజిత్, సురేష్ రాజు, చిట్యాల పోశెట్టి, శాంతికుమార్, గంగసాయన్న, డి.రమేష్, దాసరి నాగరాజు, డి.సాయన్న, చరణ్, నితిన్, ఆర్మూర్ ఏఎంసీ ఛైర్మన్ సాయిబాబా గౌడ్, పవన్ పండిట్, అయ్యప్ప శ్రీనివాస్ పాల్గొన్నారు.

## 'డయల్ 100' ఫోన్ చేసి న్యూసెన్స్

### ఒకరికి రెండురోజుల జైలు..

**అక్షరటుడే, ఆర్మూర్:** డయల్ 100ను దుర్వినియోగం చేసిన కేసులో ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు పట్టణ సీఐ సత్యనారాయణ తెలిపా రు. మండలంలోని అంకాపూర్‌కు చెందిన మాణిక్వాడ్ లాలేష్ ఇటీవల '100'కు పదే పదే కాల్ చేస్తూ పోలీసులను విసిగించడంతోపాటు అత్యవసర సేవలను దుర్వినియోగం చేశాడు. దీంతో అతనిపై కేసు నమోదు చేసి, మంగళవారం ఆర్మూర్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ ఎదుట హాజరు పర్చినట్లు పేర్కొన్నారు. దీంతో న్యాయస్థానం నిందితుడికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

గాంధారి మండలంలోని ఇందిరా నగర్‌లో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల



# పాఠశాలలకు భద్రత కరువు..!

▸ వాచ్‌మెన్లు లేక వస్తువులు చోరీ ▸ నియామకాలపై దృష్టిపెట్టని అధికారులు

**ప్రభుత్వ పాఠశాలలకు భద్రత కరువవుతోంది. వాచ్‌మెన్లు లేకపోవడంతో పాఠశాలల్లో సామగ్రి చోరీకి గురవుతోంది. ఏటా వేసవి సెలవులు, ఇతర పండుగల సందర్భంగా పాఠశాలలకు తాళాలు వేసి ఉంటున్నాయి. దీంతో కొందరు దుండగులు పాఠశాలల్లోకి చొరబడి విలువైన సామగ్రిని అపహరించుకుపోతున్నారు. సెలవుల్లో పాఠశాలల వైపు చూసేవారే లేకపోవడంతో, ఈ పరిస్థితి నెలకొంటోంది.**


**- అక్షరటుడే, గాంధారి**

ప్రభుత్వ పాఠశాలల్లో విలువైన కంప్యూటర్ పరికరాలు, రికార్డులు, సిగ్నల్ రిసీవర్లు, వైర్‌లెస్ రిసీవర్లు వంటి విలువైన సామగ్రి ఉంటుంది. ప్రభుత్వం వీటిని రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసి అందిస్తోంది. అయితే, సెలవు రోజులు పాఠశాలలు మూసి ఉంచడంతో వాటికి రక్షణ కరువవుతోంది. కనీసం వాచ్‌మెన్లు లేకపోవడంతో సామగ్రి చోరీకి గురవుతున్నాయి. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో పాఠశాలల ఆవరణలు మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. ఉదయం ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాలకు రాగానే పగిలిన మందు సీసాలు, ఇతర అసాంఘిక కార్యకలపాలకు వినియోగించే వస్తువులతో అధ్వాన్నంగా దర్శనమిస్తున్నాయి.

### వాచ్‌మెన్లను నియమిస్తే..

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో వాచ్‌మెన్లను నియమించడం లేదు. గతంలో నియమించినా.. ప్రస్తుతం వారిని కొనసాగించడం లేదు. వారు ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాలలను శుభ్రంగా ఉంచడంతోపాటు రాత్రి వేళలు, సెలవు దినాల్లో పాఠశాలకు కాపలాగా ఉండేవారు. దీంతో ఎలాంటి చోరీలు, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఉండేవి. కానీ, ప్రస్తుతం పాఠశాలలకు వాచ్‌మెన్లు లేక ఈ పరిస్థితి ఉంటోంది. ఇప్పటికైనా ప్రభుత్వం పాఠశాలలకు వాచ్‌మెన్లను నియమించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

### వాచ్‌మెన్లు ఉంటే భద్రత..



జిల్లాలో దాదాపు 1200 ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో దాదాపు ఏ పాఠశాలకు వాచ్‌మెన్లు లేరు. దీంతో పాఠశాలల్లో సామగ్రికి భద్రత కరువైంది. అలాగే స్కూళ్లపై నిఘా లేకపోవడంతో రాత్రివేళల్లో మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. పాఠశాలలకు వాచ్‌మెన్లు ఉంటే బాగుంటుంది. **– శ్రీహరి, ఎంఈవో**

## న్యాయవాది రాకేష్ కిషోర్ దిష్టి బొమ్మ దహనం

**అక్షరటుడే, ఆర్మూర్:** సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌పై న్యాయవాది రాకేష్ కిషోర్ దాడి యత్నించడం హేయమైన చర్య అని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా ఆర్మూర్ సంయుక్త కమిటీ నాయకులు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో న్యాయవాది రాకేష్ కిషోర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ఆర్మూర్ సంయుక్త మండలాల కార్యదర్శి బి కిషన్, ఆకుల గంగారాం, శేఖర్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎం నరేందర్, నజీర్, శ్రీనివాస్, పీడీఎస్‌యూ ఆర్మూర్ ఏరియా అధ్యక్షుడు డి నిఖిల్, పీపీవైఎల్ నాయకులు, నరేష్, రవి, లింబన్న, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.







## ఆర్మూర్‌లో న్యాయవాదుల విధుల బహిష్కరణ

**అక్షరటుడే, ఆర్మూర్ :** భారత ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడికి యత్నించడాన్ని నిరసిస్తూ ఆర్మూర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల శ్రీధర్, ప్రధాన కార్యదర్శి జెస్సు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో అసోసియేషన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. సీనియ ర్ న్యాయవాదులు లోక భూపతిరెడ్డి, గంట సదానందం, చిలుక కిష్టయ్య, అమితాబ్ కిరాడ్ మాట్లాడుతూ.. దేశ అత్యున్నత న్యాయస్థానంలో సీజేఐపై దాడికి యత్నించడం హేయమన్నా రు. న్యాయవాదులు దాఖలు చేసిన పిటిషన్లపై జడ్జిలు వారి పూర్తి పరిజ్ఞానంతో తీర్పులు ఇస్తారని, న్యాయవాదులు సంయమనంతో ఉండాల్సిన అవసరముందన్నారు. ఇలాంటి చర్యలతో న్యాయవ్యవస్థకే చెడ్డ పేరు వస్తుందని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రతి బార్ అసోసియేషన్ సభ్యులు న్యాయవాదులకు సూచనలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఆర్మూర్ ఉపాధ్యక్షుడు గటడి ఆనంద్, కోశాధికారి గజ్జల చైతన్య, న్యాయవాదులు పాల్గొన్నారు.

## 108 అంబులెన్స్‌లో ప్రసవం



**అక్షరటుడే, కామారెడ్డి:** అత్యవసర పరిస్థితుల్లో గర్భిణికి 108 అంబులెన్స్‌లో డెలివరీ చేశారు. రామారెడ్డి మండలం రెడ్డిపేట స్కూల్ తండాకు చెందిన రత్తుల సంతోషికి పురిటినొప్పులు ఎక్కువ కావడంతో '108'కు సమాచారం అందజేశారు. స్పందించిన సిబ్బంది వెంటనే ఆమెను తీసుకుని కామారెడ్డి జీజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో అంబులెన్స్‌లోనే సిబ్బంది ఆమెకు ప్రసవం నిర్వహించారు. సంతోషి ఆడబిడ్డకు జన్మనివ్వగా వారిద్దరూ క్షేమంగా ఉన్నారు. ఈ సందర్భంగా 108 ఈఎంటీ రాములు, పైలట్ రాజేందర్‌లకు ఆమె కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## జర్నలిస్ట్ కుటుంబానికి ఆర్థిక సాయం

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** డిచ్‌పల్లికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ నారాయణ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. దీంతో టీ పీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ వారి కుటుంబాన్ని ఇటీవల పరామర్శించారు. అలాగే రూ.లక్ష ఆర్థికసహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం బాధిత కుటుంబానికి స్థానిక కాంగ్రెస్ నాయకులు నగదు అందజేశారు. దీంతో మహేశ్‌కుమార్ గౌడ్‌కు బాధిత కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శేఖర్ గౌడ్, కంచెట్టి గంగాధర్, పొలసాని శ్రీనివాస్, ధర్మ గౌడ్, శాంసన్, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల్లో చేతుల్లో ఆయుధం.. స.హ.చట్టం

**అక్షరటుడే, భీమ్‌గల్:** సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో ఆయుధంలాంటిదని యూఎఫ్ఆర్‌టీఐ రాష్ట్ర కో-కన్వీనర్ అంకం నరేష్ అన్నారు. స.హ. చట్టం వచ్చి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా భీమ్‌గల్ మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో మంగళవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఎటువంటి సమాచారం అయినా 30 రోజుల్లోగా తెలుసుకునే హక్కు ప్రతి పౌరుడికి ఉందని పేర్కొన్నారు. ఉపకార వేతనాలు, పరీక్షలకు సంబంధించిన అంశాల్లో తప్పులు జరిగినట్లయితే సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకోవచ్చని చెప్పారు. ముఖ్య అతిథి యూఎఫ్ ఆర్‌టీఐ జిల్లా కన్వీనర్ పెద్ది మురళి మాట్లాడుతూ ప్రభుత్వం ఖర్చు పెడుతున్న ప్రతి పైసా లెక్క ప్రజలకు తెలియాల్సిందేనన్నారు. స.హ.చట్టం కింద దరఖాస్తు విధానం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ సత్యం, విద్యార్థులు పాల్గొన్నారు.




## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



**అక్షరటుడే, బాన్సువాడ:** మండలంలోని చిన్న రాంపూర్‌కు చెందిన మారుతి కొన్ని నెలల క్రితం గుండెపోటుతో మృతిచెందారు. దీంతో బాధిత కుటుంబానికి బాన్సువాడ డివిజన్ కురుమ కుల సంఘం తరపున రూ. 11వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పార్వగొండ, గంగుల గంగారం, జల్దీవార్ రమేష్, సాయినాథ్, బీరప్ప, కురుమ రఘు, బీరుగొండ, పీరుగొండ, లక్కపల్లి శ్రీనివాస్, అంకోల్ సాయన్న తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీలో చేరిన కమ్మర్‌పల్లి వీడీసీ అధ్యక్షుడు

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** కమ్మర్‌పల్లి వీడీసీ అధ్యక్షుడు భోగ రామస్వామి బీజేపీలో చేరారు. బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఏలేటి మల్లికార్జున్ రెడ్డి సమక్షంలో ఆయన మంగళవారం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ.. దేశ ప్రధాని మోదీ, ఎంపీ అర్వింద్ పాలన పట్ల ఆకర్షితుడినై బీజేపీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బద్దం రమేష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సున్నం మోహన్, కార్యదర్శి బలరాం, బీజేవైఎం అధ్యక్షుడు కొత్తపల్లి గణేష్, బీజేపీ నాయకులు రెంజల్ల గంగాధర్, కొత్తపల్లి అరుణ్, చింత ప్రవీణ్, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## గిరిజనుల హక్కుల కోసం పోరాడిన యోధుడు కొమురం భీం

**అక్షరటుడే, బాన్సువాడ :** గిరిజనుల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన యోధుడు కొమురంభీం అని నాయక్‌పోడ్ సంఘం కామారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు పెంకటి గణేష్ అన్నారు. బాన్సువాడ మండలంలోని హన్మాజీపేట్‌లో ఆదివాసీ నాయకులు, గిరిజన సంఘ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం కొమురం భీం వర్ధంతిని నిర్వహించారు. విప్లవ వీరుడు కొమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పెంకటి గణేష్ మాట్లాడుతూ.. జల్, జంగల్ జమీన్ నినాదంతో ఆడబిడ్డల హక్కుల కోసం, గిరిజనుల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన గోండు వీరుడు కొమురం భీం అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కొంకి గణేష్, కొంకి సాయిలు, గంగాధర్ పాల్గొన్నారు.




## ముప్కాల్‌లో పోషణ మాసం..

**అక్షరటుడే, ముప్కాల్:** మండల కేంద్రంలో మంగళవారం పోషణ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీవో గౌస్ మోహినుద్దీన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై వివరించారు. పిల్లల పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తూ, సరైన ఆహారపు అలవాట్లను పాటించాల్సిన అవసరాన్ని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ మాధవి, ముప్కాల్ పంచాయతీ కార్యదర్శి మల్లేష్ యాదవ్, అంగన్‌వాడీ టీచర్లు అమినా బేగం, జ్యోతి, మేఘన, వాణి, పద్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.